

మల్లన్న సేవలో నారా లోకేశ్ దంపతులు



ఆలయ మర్యాదలతో నారా లోకేశ్ దంపతులకు స్వాగతం

శ్రీశైలం, ఫిబ్రవరి 1: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను గురువారం ఉదయం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దంపతులు కుమారుడు దేవాన్ష్‌తో కలిసి దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో నారా లోకేశ్ దంపతులు సాక్షిగణపతి ఆలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహానికి చేరుకుని అక్కడి నుంచి క్షేత్ర పరిధిలోని బయలు వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయం రాజగోపురం వద్ద నారా లోకేశ్, నారా బ్రాహ్మణిలకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం రత్నగర్భ గణపతిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించుకున్నారు. తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన జరిపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నారా లోకేశ్ దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, మోహన్ నారా లోకేశ్ దంపతులకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఇదిలా ఉండగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు బుడ్డా రాజశేఖరరెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, భూమా అఖిలప్రియ, ఎన్‌ఎండీ ఫరూక్, గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ నాయకులు భూమా బ్రహ్మానందరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, భూమా జగత్ విఖ్యాతరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ వెంకటరాముడు తదితరులు లోకేశ్‌కు స్వాగతం పలికారు.

స్వాగతం పలికిన టీడీపీ నాయకులు



స్వాగతం పలుకుతున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డి












నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు బీసీ జనార్దన్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, జగత్ విఖ్యాత్‌రెడ్డి, గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి



వైసీపీలో లుకలుకలు..!

- అధికార పార్టీలో పెరుగుతున్న ధిక్కార స్వరాలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల (ఆంధ్రజ్యోతి), నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1:

అధికార పార్టీలో ధిక్కార స్వరాలు పెరుగుతున్నాయి. ఎమ్మెల్యే శిల్పా కుటుంబ పోకడలపై అదే పార్టీకి చెందిన పలువురు నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో కొందరు నాయకులు శిల్పా కుటుంబ పెత్తనం భరించలేక ఎదురు తిరిగిన సందర్భాలు ఉన్నాయి. కొందరైతే శిల్పా కుటుంబ సభ్యుల్లో మార్పు రాకపోవడంతో ఇక వారి పంచన పని చేయడం శుద్ధ దండగ అని ఇతర పార్టీల తీర్థం పుచ్చుకున్నారు. మరికొందరు అధికార పార్టీలోనే కొనసాగుతూ అవకాశం వచ్చినప్పుడల్లా తమ వాణిని గట్టిగా వినిపిస్తున్నారు. ఈ కోవలోకి మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గోకుల్ కృష్ణారెడ్డి వస్తారు.

తారాస్థాయికి చేరిన విభేదాలు

నంద్యాల వైసీపీలోని వర్గ విభేదాలు తారా స్థాయికి చేరాయి. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిపై అదే పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి మధ్య వివాదం ముదురుతోంది. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలంటూ గోకుల్ కృష్ణారెడ్డి అధికార పార్టీ అధిష్ఠానాన్ని కోరడాన్ని జీర్ణించుకోలేని శిల్పా వర్గం ఆయనను టార్గెట్ చేసింది. ఈ నేపథ్యంలో స్థానికుల ఆత్మగౌరవ యాత్ర పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని శిల్పా వర్గం భగ్నం చేయడంతో గోకుల్‌రెడ్డి అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. రిపబ్లిక్‌డే సందర్భంగా నంద్యాలలోని గాంధీ చౌక్‌లో స్థానికుల ఆత్మగౌరవ మౌన దీక్ష కార్యక్రమాన్ని గోకుల్ తలపెట్టడం.. దీక్షకు అనుమతిలేదని పోలీసులు భీమవరం చేరుకొని ఆయనను హౌస్ అరెస్ట్ చేయడం వంటి పరిణామాలు వైసీపీలోని విభేదాలను మరింత బట్టబయలు చేశాయి.

బలమైన నేతలతోనే గెలుపు



వైసీపీ గాలికి తోడు స్థానికంగా బలమైన నేతలు గట్టిగా కృషి చేయడంతో గత ఎన్నికల్లో శిల్పా రవి విజయం సాధించాడు. ముఖ్యంగా మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తాతిరెడ్డి తులిసిరెడ్డి వంటి వారు పార్టీకి సేవలు చేశారు. ఆ తర్వాత వీరిని పూర్తిగా పక్కన పెట్టాడు. మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ ఆరంభం నుంచి వైసీపీ జెండా మోశాడు. అయితే భవిష్యత్తులో తనకు అడ్డంకిగా మారతాడన్న ఉద్దేశంతో ఆయనను తొక్కిపెట్టేందుకు ప్రయత్నించాడు. మునిసిపల్ ఎన్నికల్లో ఆయన వర్గానికి కనీస ప్రాధాన్యం ఇవ్వకుండా చేశాడు. అంతేగాకుండా.. ఆయన ఆర్థిక మూలాల మీద ఎమ్మెల్యే శిల్పా రవి దెబ్బకొట్టే ప్రయత్నం చేసినా రాజగోపాల్‌రెడ్డి తన వర్గాన్ని కాపాడుకోగలిగాడు. ఎమ్మెల్యే ఇంత చేస్తున్నా.. రాజగోపాల్‌రెడ్డి ఏనాడు పార్టీపైన తన అసంతృప్తిని వ్యక్తం చేయలేదు. ఇక ప్రస్తుత టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి శిల్పా కుటుంబానికి సన్నిహితంగా ఉన్నారు. వైసీపీ లీగల్ సెల్‌లో ఉంటూ సేవలందించాడు. ఆయన సేవలను వినియోగించుకున్న శిల్పా రవి తర్వాత పట్టించుకోవడం మానేశారు. గుర్తింపు లేని చోట ఉండటం అనవసరమనుకున్న తులసిరెడ్డి పార్టీని వీడుదామనుకున్న సమయంలో ఏపీ ఆగ్రోస్ డైరెక్టర్ పదవిని ఆశ చూపారు. అవసరమున్నంత వరకు వాడుకుని తర్వాత పక్కనపెట్టే ఎమ్మెల్యే రవి నైజాన్ని పసిగట్టిన తులసిరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అటు రాజగోపాల్‌రెడ్డి, ఇటు తులసిరెడ్డి ఇద్దరికీ కూడా స్థానిక ప్రజల్లో మంచి పట్టు ఉంది. ఈ వ్యతిరేకత అంతా రానున్న ఎన్నికల్లో శిల్పాను ఓటమి పాలుజేసే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదేం తీరంటూ..



ఓ వైపు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోవడంలో విఫలమవుతున్న ఎమ్మెల్యే శిల్పా కుటుంబం.. కొన్ని వివాదాలను కోరి మరీ తెచ్చుకుంటోంది. ఇటీవల రెండు వర్గాలను రెచ్చగొట్టేలా స్థానికంగా కొన్ని ఫ్లెక్సీలు వెలిశాయి. వీటిపై ప్రతిపక్ష పార్టీల నుంచే కాకుండా, సొంత పార్టీ వారి నుంచి కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్ళ నుంచి రాజకీయాల్లో ఉన్నా పరిణతి రాలేదని, ఇలాంటి వ్యాఖ్యలు, చేష్టలు పార్టీకి చెడ్డపేరు తీసుకువస్తాయన్న అభిప్రాయాన్ని కొందరు వెలిబుచ్చుతున్నారు. ప్రజల నుంచి తీవ్రంగా వ్యతిరేకత వస్తుండటంతో, రానున్న ఎన్నికల్లో గెలుపుపై నమ్మకం లేకనే శిల్పా కుటుంబం ఇలాంటి తీరును కనబరుస్తోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అసంతృప్తితో కౌన్సిలర్లు..

ఎమ్మెల్యే శిల్పా వ్యవహారంతో సొంత పార్టీ కౌన్సిలర్లే అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. వారి వార్డులో ఏ పని జరగాలన్నా, మున్సిపాలిటీలో ఏం జరగాలన్నా ఎమ్మెల్యే కుటుంబం చెప్పినట్లు సాగాల్సిందే! ఆఖరికి కౌన్సిల్ మీట్‌లో అధికార పార్టీ కౌన్సిలర్ ఏదన్నా మాట్లాడాలన్నా వారి అనుమతి కావాల్సిందే! కొద్దికాలం కిందట ఆ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా పని చేస్తున్న టీం నియోజకవర్గంలోని పరిస్థితులను తెలుసుకునేందుకు ఓ సమావేశం నిర్వహించింది. ఇందులో తమ అభిప్రాయాలను, అసంతృప్తిని వినిపించేందుకు సిద్ధమవగా.. ఎమ్మెల్యే కుటుంబం వారికి కనీసం మాట్లాడే అవకాశాన్ని ఇవ్వకపోగా అవమానకరంగా మాట్లాడినట్లు సమాచారం. తమ వార్డుల్లో పనులు సరిగా జరగక తమ అసంతృప్తిని చెప్పుకునే అవకాశమూ ఇవ్వకపోతే.. తాము మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి ఏం ప్రయోజనమని తమ సన్నిహితుల వద్ద ఆవేదన చెందినట్లు తెలుస్తోంది. అధికారంలో ఉండి కూడా పనులు చేయించుకోలేకపోతే.. ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని, ఎన్నికలు సమీపించిన వేళ పనులు మొదలుపెట్టినా ప్రజలు హర్షించరన్న అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది.



సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి

పోలీసు అధికారులను ఆదేశించిన డీజీపీ



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పోలీసు అధికారులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1 : సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో డీఐజీలు అమ్మిరెడ్డి, సెంథిల్‌కుమార్‌లతోపాటు కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల ఎస్పీలతో ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా వేసి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాగే సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి నిఘా కట్టుదిట్టం చేసుకోవాలని, ఎన్నికల సమయంకంటే ముందే బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, కడప ఎస్పీ సిద్ధార్థకౌశల్, అనంతపురం ఎస్పీ అన్బురాజన్, సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి, నంద్యాల జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పత్తి క్వింటా రూ. 7,010



ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 1: ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి ధరలు పడిపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. సీజన్ ముగిసిపోతున్నా పత్తి ధరలు పెరగకపోవడంతో కుమిలిపోతున్నారు. గురువారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,010 పలికింది. గత నెల రోజులుగా పత్తి ధర క్వింటం రూ.7 వేలకు మించి పలకడం లేదు. ఈ ధరలు తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిందని, ధరలు కూడా లేకపోవడంతో అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1447 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా, కనిష్ఠ ధర రూ.4506, గరిష్ఠ ధర రూ.7010, మధ్యస్థ ధర రూ.6759 పలికింది.



చాగలమర్రిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

బీసీలను విస్మరించిన వైసీపీ : భూమా అఖిలప్రియ

చాగలమర్రి, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో బీసీల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం రాత్రి చాగలమర్రి గ్రామంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రికి మండల బీసీ సంఘ నాయకులు పెద్ద ఎత్తున గజమాలతో స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ బీసీలకు చెందాల్సిన రూ.75 వేల కోట్లు నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఉన్న దానిని 24 శాతానికి తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. బీసీలలో కొందరికి మంత్రి పదవి ఇచ్చినంత మాత్రాన రాష్ట్రంలో బీసీలందరికి న్యాయం జరిగినట్లేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 14 లక్షల ఎకరాలు కబ్జాకు గురైతే అందులో ఎక్కువ బీసీ బాధితులే ఉన్నారని అన్నారు. 70 వేల బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేక పోయిందన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు 13 బీసీ భవనాలు నిర్మించడానికి సంతకాలు పెట్టారని, 1,000 కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అయతే వాటన్నింటినీ వైసీపీ ప్రభుత్వం నీరుగార్చిందని మండిపడ్డారు. టీడీపీ హయాంలో విదేశీ విద్యతో ఎంతో మంది పేద బీసీలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో నిలిచేవారని, వైసీపీ ప్రభుత్వంలో విదేశీ విద్య కరువై ఎంతో మంది ప్రతిభ కలిగిన బీసీ విద్యార్థులు గ్రామాల్లో పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జయహో బీసీ కరపత్రాలను ఆవిష్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, జిల్లేల శ్రీరాములు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి నడిపి బూషన్న, నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి సల్లా నాగరాజు, గుర్రప్ప, లక్ష్మీనారాయణగౌడ్, మహబూబ్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బీసీ, మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు.



నంద్యాల గ్రామ్ -119 రకం శనగ పంట

శనగ సాగులో నంద్యాల గ్రామ్ -119 విప్లవం

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 1: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఎనిమిదేళ్ళ క్రితం పప్పు శనగలో కొత్త వంగడం నంద్యాల గ్రామ్ (ఎన్‌బీఈజీ)-119 రకాన్ని తయారు చేశారు. ఇది ప్రస్తుతం శనగ సాగులో విశేష గుర్తింపు పొంది రైతులకు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో శనగపంటను ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటు ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కువగా సాగు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల హెక్టార్లల్లో శనగ పంట సాగు అయితే ఇందులో 90 శాతం ఈ జిల్లాల నుంచే దిగుబడి వస్తోంది. దేశంలో వందేళ్ళకుపైగా చరిత్ర ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ కేంద్రం నుంచి ఎన్నో రకాల పంటల్లో నూతన వంగడాలు, రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణను ముందుకు తీసుకొచ్చింది.. ఈ కృషిలో ఇక్కడి శాస్త్రవేత్తలు దేశ వ్యాప్త గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలోనే 2015లో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి శనగలో విడుదలైన నంద్యాల గ్రామ్ -119 రకం ప్రస్తుతం శనగ సాగు విస్తీర్ణంలో అత్యధిక శాతం సాగవుతోంది. స్వల్పకాలిక రకంగా, అధిక దిగుబడి ఇచ్చే, దక్షిణ భారతదేశంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో నంద్యాల గ్రామ్ -119 విశేష ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో ఇక్కడి శాస్త్రవేత్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా సాగు




నంద్యాల గ్రామ్ -119 రకం శనగ విత్తనం

నంద్యాల గ్రామ్ -119 రకం రైతు పొలాల్లో ఎకరానికి 10 -12 క్వింటాళ్ళ దిగుబడి, స్వల్పకాలిక రకం కావడంతో రాయలసీమ జిల్లాల్లో సైతం ఈ రకం సాగు విప్లవం దిశగా సాగుతోంది. ప్రకాశం జిల్లాలో సాగు విస్తీర్ణం దాదాపు 40 వేల హెక్టార్లకు చేరిన నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సైతం ఈ రకాన్ని సాగు చేసేందుకు ప్రకాశం జిల్లా రైతుల నుంచి 119 విత్తనాన్ని కొనుగోలు చేసి సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎన్నో ఏళ్ళ నుంచి పలు శనగ రకాలను రైతులు సాగు చేస్తున్నప్పటికీ చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాల వ్యవధితో అనువైన రకంగా నంద్యాల గ్రామ్-119 ప్రాచుర్యం పొందడంతో మున్ముందు మరింత విస్తృత స్థాయిలో ఈ రకం సాగయ్యే అవకాశం ఉన్నట్లు నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శనగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.జయలక్ష్మి పేర్కొన్నారు.

మూడేళ్లలో 'ప్రకాశం'లో 40 వేల హెక్టార్ల స్థాయికి..

నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి అధికారికంగా నంద్యాల గ్రామ్ -119 విడుదలైన తరువాత ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా శనగ విత్తనాన్ని అందజేశారు. ఆ రైతులకు అవగాహన కల్పించి ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో రైతులు సాగు చేసుకోవడానికి వీలుగా వారిని ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలోనే ప్రకాశం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణంలో 40 వేల హెక్టార్లల్లో నంద్యాల గ్రామ్ 119 సాగు స్థాయికి చేరుకోవడం రికార్డుగా చెప్పుకోవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. నంద్యాల గ్రామ్ -119 ముందు ప్రకాశం జిల్లాలో 80 శాతం కాబూలి శనగ రకం కేఏకే-2 అనే 100 గింజలు 35 గ్రాములు బరువు కలిగిన రకాన్ని 20 ఏళ్లుగా సాగు చేస్తూ వచ్చారు. అయితే కేఏకే -2 రకం శనగకు ఎండు తెగులు విపరీతంగా ఆశించి, దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో 100 గింజలు 38-40 గ్రాముల బరువు కలిగిన స్వల్పకాలిక, అధిక దిగుబడి వచ్చే, ఎండు తెగులును సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన నంద్యాల గ్రామ్-119పై రైతులు దృష్టి సారించారు. అప్పటికే ఈ రకంపై అవగాహన కలిగి ఉండటంతో ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల ద్వారా వచ్చిన విత్తనాన్ని రైతులు తమ తోటి రైతులకు విత్తనంగా అందజేయడంతో మూడేళ్ల వ్యవధిలోనే ప్రకాశం జిల్లాలో నంద్యాల గ్రామ్ -119 సాగు విస్తీర్ణం 40 వేల హెక్టార్లకు చేరింది.



ఎన్‌బీఈజీ -119 రకం మొక్క

- స్వల్పకాలిక రకం.. అధిక దిగుబడి
- ప్రకాశం జిల్లాలో శనగ సాగులో 80 శాతం నంద్యాల గ్రామ్ -119
- కర్నూలు, కడప ఉమ్మడి జిల్లాల్లో విశేష గుర్తింపు
- నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ వంగడం శనగ -119 సక్సెస్



నంద్యాల గ్రామ్ -119 రకం శనగ పంటను సాగు చేసిన రైతులతో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు

నంద్యాల గ్రామ్ -119కు మంచి డిమాండ్



మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో కూడా నంద్యాల గ్రామ్-119 రకం సాగు రైతులకు ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడులు ఇచ్చి రైతులకు అండగా నిలవడం జరిగింది. గత ఏడాది క్వింటా ధర రూ.12,000- రూ.14,000 ధర పలికి విత్తనంగా మంచి డిమాండ్‌లో ఉంది. 95 రోజుల స్వల్పకాలిక కాబూలి శనగ రకం, 100 గింజల బరువు 38-40 గ్రాములు, గింజ లావు ఉండి, ఆకర్షణీయంగా ఉంటుంది. హెక్టారుకు వర్షాధారంలో 17.5-20 క్వింటాళ్ళ దిగుబడి, 1 లేదా 2 తడులతో హెక్టారుకు 20-25 క్వింటాళ్ళ దిగుబడి, ఎండు తెగులును తట్టుకునే సామర్థ్యం ఉంది. మున్ముందు రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి విడుదలైన నంద్యాల గ్రామ్-119 సాగు విప్లవం రికార్డు దశకు చేరుకుంటుంది.

- డాక్టర్ వి.జయలక్ష్మి, శనగ ప్రధాన శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్, నంద్యాల

16 మంది సీఐలు బదిలీ

కర్నూలు, ఫిబ్రవరి 1: కర్నూలు రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఉపేంద్ర బాబు	వీఆర్ కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఆదిలక్ష్మమ్మ	వీఆర్ కర్నూలు రేంజ్	వీఆర్ కర్నూలు
నాగశేఖర్	వీఆర్, కర్నూలు రేంజ్	వీఆర్ అన్నమయ్య
శివాంజనేయులు	వీఆర్, కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఆర్.అర్జున్ నాయక్	వీఆర్ కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
కంబగిరి రాముడు	వీఆర్ కర్నూలు రేంజ్	ఎస్సీఎస్టీసెల్ నంద్యాల
కళా వెంకట్రమణ	వీఆర్ కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
శ్రీనివాస నాయక్	కర్నూలు రేంజ్	సీసీఎస్-1 కడప
శ్రీరామ్	కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
సోనక్క	వీఆర్, కర్నూలు	అనంతపురం రేంజ్
సురేష్ కుమార్	వీఆర్ కర్నూలు	సీసీఎస్ నంద్యాల
ఆర్.రామకృష్ణ	వీఆర్, కర్నూలు	అనంతపురం
లక్ష్మయ్య	వీఆర్ కర్నూలు	అనంతపురం
సుదర్శన ప్రసాద్	వీఆర్, కడప	అనంతపురం రేంజ్
మురళీ కృష్ణ	వీఆర్, అన్నమయ్య	అనంతపురం రేంజ్
మల్లికార్జున గుప్త	పీసీఆర్ నంద్యాల	వీఆర్ అన్నమయ్య

65 మంది ఆర్‌పీఎస్‌ఐలు...

కర్నూలు, ఫిబ్రవరి 1: రాయలసీమ రేంజ్ పరిధిలో ఉన్న 65 మంది ఆర్‌పీఎస్‌ఐలను స్థానాలు మారుస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరిని వివిధ జిల్లాలకు కేటాయించారు.

8 మంది డీఎస్పీల బదిలీ

కర్నూలు, ఫిబ్రవరి 1: కర్నూలు జిల్లాలో ఉన్న ఎనిమిది మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డీఎస్పీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఐ.సుధాకర్ రెడ్డి	కర్నూలు దిశా పీఎస్	చిత్తూరు దిశా పీఎస్
ఎస్.యుగంధర్‌బాబు	రెండో బెటాలియన్ అసిస్టెంట్	పశ్చిమ గోదావరి సీసీఎస్ కమాండెంట్
ఎం.నాగభూషణం	ట్రాఫిక్, కర్నూలు	14వ బెటాలియన్ డీఎస్పీ
సి.మహేశ్వరరెడ్డి	నంద్యాల ఎస్‌డీపీవో	ఎస్‌డీపీవో పలమనేరు
వి.వెంకట్రామయ్య	ఎస్‌డీపీవో ఆళ్లగడ్డ	ఎస్‌డీపీవో మచిలీపట్నం
ఆర్.రామాంజినాయక్	14వ బెటాలియన్ (అటాచ్డ్)	3వ బెటాలియన్ డీఎస్పీ టు ఎస్సీ, ఎస్టీ సెల్ నంద్యాల
ఎ.శ్రీనివాసరావు	సీసీఎస్, నంద్యాల	ఎస్‌డీపీవో కందుకూరు
ఎస్.సుధాకర్ రెడ్డి	ఎస్‌డీపీవో, పలమనేరు	ఎస్‌డీపీవో ఆళ్లగడ్డ

11 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

కర్నూలు, ఫిబ్రవరి 1: కర్నూలు రేంజ్ పరిధిలో ఉన్న 11 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వారికి పదోన్నతి కల్పించి పోస్టింగ్ కూడా ప్రకటించింది. పదోన్నతి పొందిన వారిలో ఉపేంద్రబాబుకు పదోన్నతి కల్పించి అనకాపల్లి దిశా డీఎస్పీగా, నాగరాజును సీఐడీ డీఎస్పీగా, రామకృష్ణుడును ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, తేజేశ్వర్‌రావును చిత్తూరు ఎస్‌బీ డీఎస్పీగా, సాయినాథ్‌ను నెల్లూరు దిశా డీఎస్పీగా, రామకృష్ణాచారిని సీఐడీ డీఎస్పీగా, రమణారావును ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, నరసింహమూర్తిని నగరి డీఎస్పీగా, వేణుగోపాల్‌ను సీఐడీ డీఎస్పీగా, దేగల ప్రభాకర్‌ను సిట్ డీఎస్పీగా, రవీంద్రనాథ్ రెడ్డిని నంద్యాల డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పకడ్బందీగా ప్రాక్టికల్స్ నిర్వహించండి: ఆర్ఐవో

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిర్వహించాలని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్ పాషా అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో సైన్స్ లెక్చరర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు పరీక్షలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సు ప్రాక్టికల్స్ పరీక్షలు, 11 నుంచి 20వ తేదీ వరకు జనరల్ కోర్సు ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయని అన్నారు. ప్రతి రోజు ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే మార్కులు అప్‌లోడు చేసి పంపాలన్నారు. ప్రాక్టికల్స్‌లో ఎలాంటి పొరపాట్లు జరగరాదన్నారు. పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగితే అందుకు వారే బాధ్యత వహించాలన్నారు. శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మానవీయ విలువల పరీక్ష, 3న పర్యావరణ విద్యా పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 22,239 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. విద్యార్థులందరూ పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు ఓటీపీ వస్తుందని, ఆ తర్వాతనే ప్రశ్నాపత్రం డౌన్‌లోడు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్లు జి.లాలెప్ప, పరమేశ్వరరెడ్డి, సుంకన్న, ప్రభు, సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

భజన సభ

- ప్రచారం కోసమా అన్నట్లుగా 'ఆసరా' సమావేశం
- జగన్ నామ స్మరణతో విసుగు చెందిన మహిళలు
- కార్యక్రమం ప్రారంభించకుండానే వెళ్లిపోయిన వైనం
- కుర్చీలు ఖాళీ అవుతుండడంతో అడ్డుకున్న మెప్మా సిబ్బంది



ఖాళీ కుర్చీలు



బయటికి వెళ్లిపోతున్న మహిళలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 1: వైఎస్‌ఆర్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం వైసీపీ ప్రచారం కార్యక్రమంలా మారింది. గురువారం నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో వైఎస్సార్ నాలుగో విడత సంబరాలు అంటూ మెప్మా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. అయితే సమావేశానికి హాజరైన వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆసరా కార్యక్రమాన్ని పక్కనబెట్టి సీఎం జగన్ మోహన్‌రెడ్డి నామస్మరణ చేయడం మొదలుపెట్టారు. దీంతో విసుగు చెందిన మహిళలు.. ఇళ్ల వద్ద పనులు మానుకుని వచ్చామని, ఇక్కడికి వచ్చాక పార్టీ గురించి భజన చేయడం ఏమిటని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా మహిళలకు ఆసరా ద్వారా డబ్బులు జమ చేస్తున్నారని.. అయితే ఈ సారి వైసీపీని పొగడటం ఏమిటని మండిపడ్డారు.

బయటకు వెళ్లకుండా అడ్డుకున్న సీఈఓలు

ఉదయం 12 గంటలకు కార్యక్రమం ప్రారంభమైతే నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌లు 12.30 గంటలకు ఎగ్జిబిషన్ మైదానంలోకి వచ్చారు. అయితే అప్పటికే ఓపిక నశించిన మహిళలు బయటికి వెళ్లిపోవడం మొదలుపెట్టారు. దీంతో అతిథులు వచ్చిన సమయానికే సగం కుర్చీలు ఖాళీలు అయ్యాయి. కార్యక్రమం పూర్తి కాకుండానే మొత్తం వెళ్లిపోయే పరిస్థితి నెలకొనడంతో మెప్మా సీఈఓలు ప్రధాన గేటుకు తాళం వేశారు. అంతేగాకుండా మరోదారి వైపు కుర్చీలు వేసి మహిళలు బయటికి వెళ్లకుండా అడ్డుకున్నారు. చివరకు రూ.20,27,39,575 ఆసరా చెక్కును మేయర్, ఎమ్మెల్యేలు మహిళలకు అందజేశారు.

కనీస వసతులు కల్పించలేదు..

ఇంటి వద్ద నుంచి ఉదయం 9 గంటలకే బయలుదేరి సమావేశానికి వచ్చిన మహిళలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారు. మంచినీరు, బిస్కెట్లు కూడా ఇవ్వకపోవడంతో కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద సమావేశం ఏర్పాటు చేసి చివరికి మంచినీరు కూడా ఇవ్వక పోతే సమావేశం ఎందుకు పెట్టారని అక్కసు వెళ్లగక్కారు. కార్యక్ర మంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెప్మా పీడీ నాగ శివలీల, డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, మెప్మా టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సీఎంఎం మురళి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రెండు వాహనాలు స్వాధీనం



పట్టుబడ్డ అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు

ఆదోని, ఫిబ్రవరి 1: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం నిందితులను విలేకరుల ముందు హాజరుపరిచారు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు, టూటౌన్ సీఐ గోపీనాథ్, తాలూకా సీఐ నరసింహా రెడ్డి వివరాలను వెల్లడించారు. హిందూపురానికి చెందిన ఫారుక్, అతని సోదరుడు అక్రమ్, హర్యానా రాష్ట్రం పల్వర్ జిల్లాకు చెందిన కమల్ అలీ, మేవ్ అక్రమ్, ఆసిఫ్ అహ్మద్, అర్షద్, ఇర్షాద్ అనే వ్యక్తులతో పరిచయం ఏర్పరచుకున్నారన్నారు. హిందూపురం పట్టణంలోని ఓ మటన్ షాపు నడుపుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరంతా తొందరగా డబ్బులు సంపాదించాలని రోడ్లపై ఉండే పశువులు, పొల్లాల్లో ఉండే దూడలను దొంగతనం చేసి వాహనంలో తరలించేవారు. వాటిని కబేళాలకు తరలించి విక్రయించుకునే వారు. అయితే పశువుల తరలింపునకు అవసరమైన వాహనాన్ని దొంగలించుకునేందుకు పథకం రూపొందించుకున్నారు. జనవరి 21న ఆదోనికి ఒక సఫారీ వాహనంలో వచ్చి నాలుగు చక్రాల వాహనం కోసం వెతుకుతున్నారు. టీడీపీ నేత గుడిసె కృష్ణమ్మ ఇంటి ముందు ఉన్న స్కార్పియో వాహనాన్ని దొంగలించారు. తాము తెచ్చుకున్న సఫారీ వాహనంలోని తాడుతో, ఈ స్కార్పియో వాహనాన్ని కట్టుకొని ఊరు బయటకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వాహనాన్ని హిందూపురానికి నడుపుకుంటూ వెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. జనవరి 31న హిందూపురం వద్ద ఆటోనగర్‌లో నలుగురు నిందితులు వసిం అక్రమ్, కమల్ అలీ, మేవ్ అక్రమ్, ఆసిఫ్‌లను అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు ఫరూక్, మహమ్మద్ అరిఫ్, ఇర్షాదులు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి టీడీపీ నేత కృష్ణమ్మ స్కార్పియో వాహనంతోపాటు మరో సఫారీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఓటుకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు (కలెక్టర్), ఫిబ్రవరి 1: 18 సంవత్సరాలు నిండిన యువ తీ యువకులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితా జనవరి 22 వ తేదిన ప్రచురించామని, జాబితాపై వివిధ దినపత్రికల్లో వస్తున్న వ్యతిరేకవార్తల మీద విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈవీఎంలు, వివిప్యాట్ల వినియోగం పై అవగాహన కల్పిస్తున్నామని, ఇందులో సెక్టోరల్ ఆఫీసర్స్ , రాజకీయ పార్టీల ప్రతినిధులను కూడా భాగస్వాములను చేస్తామని తెలపారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

కర్నూలు, ఫిబ్రవరి 1: రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీటీసీ శ్రీధర్ మాసోత్సవాల మోటారు సైకిళ్ల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియామాలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని కోరారు. ఆర్టీవో రమేష్, ఎంవీఐ మల్లికార్జున, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, సీఐలు రమణ, గౌతమి, ఆర్ఎస్ఐ హుశేన్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి

మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్



ప్రమాణస్వీకారం చేస్తున్న జిల్లా ఆర్యవైశ్యసంఘం కమిటీ సభ్యులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 1: పార్టీలకతీతంగా ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని ఆర్యవైశ్య మహాసభ జాతీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. నంద్యాల సౌజన్య కన్వెన్షన్‌లో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుల ప్రమాణ స్వీకారానికి విశిష్ఠ అతిథిగా హాజరైన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాల ద్వారా పేద ఆర్యవైశ్యులను ఆదుకోవాలని అన్నారు. ఆర్యవైశ్యులు అన్ని పార్టీలలో ఉండాల్సిందేనని, వారి స్థాయిని బట్టి వారు రాజకీయంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రథమ అధ్యక్షుడిగా భవనాశి నాగమహేష్, గౌరవ అధ్యక్షుడిగా ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, ప్రధాన కార్యదర్శిగా కాల్వ విజయ శేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు చిన్న రామసత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం


నారా లోకేశ్‌తో భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డి

శ్రీశైలం, ఫిబ్రవరి 1: శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను టీడీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు మీడియా కోఆర్డినేటర్ వెంకట్రాముడు లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు.

నందికొట్కూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు శ్రీశైలంలో గురువారం ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజవకర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం లికారు. నారా లోకేశ్, బ్రాహ్మిణి దంపతులు శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, తెలుగు యువత నాయకుడు మహేష్ ఉన్నారు.

నేడు కలెక్టర్‌గా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 1: నంద్యాల కలెక్టర్‌గా శుక్రవారం కె.శ్రీనివాసులు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పని చేసిన కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సామూన్ శ్రీకాకుళానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాపట్ల నుంచి నంద్యాల కలెక్టర్‌గా శ్రీనివాసులును నియమించారు.

సచివాలయ సిబ్బందితో జేసీ సమీక్ష


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 1: చాపిరేవుల గ్రామంలో జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్ రెడ్డి గురువారం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నవరత్నాల్లో భాగంగా నిరుపేదలకు మంజూరు చేసిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, సంబంధిత అంశాలపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ లోపు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫ్ట్‌వేర్ కొత్తది కావడంతో కొంత జాప్యం ఏర్పడిందని, సమీక్షిస్తున్నామని చెప్పారు. ఈ రిజిస్ట్రేషన్‌తో పాటు కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై పది సంవత్సరాల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ సునంద, వీఆర్వో బాలన్న, సిబ్బంది పాల్గొన్నారు.

'నాటుకోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి'


చెంచు మహిళలకు అవగాహన కల్పిస్తున్న నాబార్డు మెంబర్

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 1: నాటుకోళ్ల పెంపకం ద్వారా చెంచులు అదనపు ఆదాయాన్ని ఆర్జించి ఆర్థిక పురోభివృద్ధి సాధించవచ్చని నాబార్డు మెంబర్ జహీద్, ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ మేనేజర్ కేజీ నాయక్ పేర్కొన్నారు. గురువారం భైర్లూటి గూడెంలో నాటుకోళ్ల పెంపకంపై చెంచు మహిళలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ భైర్లూటి, నాగలూటి, అమలాపురం, ఇందిరేశ్వరం, రుద్రకోడూరు చెంచు గూడేల్లో మొత్తం 110 చెంచు కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి 20 నాటు కోళ్ల చొప్పున 2200 నాటుకోళ్ళు ఇచ్చినట్లు తెలిపారు. నాటు కోళ్ల పెంపకం ద్వారా మహిళలు అదనపు ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా అదనంగా మరో 50 దినాల పని రోజులు పెంచామన్నారు. ఆయా గూడేల్లోని ప్రతి ఒక్కరికి పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువమ్మ, ఏపీవో నాగార్జున, వైసీకేపీ యూసఫ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కేంద్ర పథకాలపై అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో అభిరుచి మధు, బీజేపీ కార్యకర్తలు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి శుక్రవారం నుంచి ప్రతి ఇంటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తామని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు తెలిపారు. ఎన్నికల కార్యాలయాలను రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వర్చువల్‌గా ప్రారంభించారని, అలాగే నంద్యాల పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నంద్యాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు తిలకించారు.

'ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్'

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 1: జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ యోగం కొళాయిని ఏర్పాటు చేయనున్నట్లు జల్ జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం జిల్లా సమన్వయకర్త భీమశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్‌పై అవగాహన సదస్సు ఎంపీడీవో నూర్జహాన్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనుల నిర్వహణ కోసం జలసంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొత్తం 11మంది ఉంటే ఈ కమిటీలో 9మంది డ్వాక్రా మహిళలు సభ్యులుగానూ, గ్రామంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి ఎక్స్‌ఆఫీషియో సభ్యుడిగా ఉంటారని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఏఈ నాగేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మందుబాబుల వీరంగం

● పాఠశాల సామగ్రి ధ్వంసం


ట్యాంకును కిందకు పడేసి
పైపులు, మరుగుదొడ్డి గొళ్లెంను తొలగించిన దృశ్యం


తెగిపోయిన విద్యుత్ తీగలు

పాణ్యం, ఫిబ్రవరి 1: మండలంలోని పిన్నాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని నాడునేడు పనుల సామగ్రిని బుధవారం రాత్రి గుర్తు తెలియని మందుబాబు ధ్వంసం చేశారు. నాడునేడు పనుల్లో భాగంగా చేపట్టిన తాగునీరు. పైపులైను నిర్మాణం, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, వాటర్ ట్యాంకు, సంపు తదితర సామగ్రిని తాగుబబోతులు ధ్వంసం చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం కేశవ తెలిపారు. ఈ సంఘటనపై హెచ్‌ఎం గురువారం పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ అశోక్, సిబ్బంది పాఠశాలను తనిఖీ చేశారు. తాగుబోతులు రాత్రి ధ్వంసం చేసి మద్యం సీసాలు పగులగొట్టడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. తాగుబోతులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 1: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. మండలంలోని శివపురం, సమీపంలోని గిరిజనగూడెంలో ఆ పార్టీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారు కొలనుభారతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వం వస్తే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరించారు. జయసూర్య మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు జగన్ మోసపూరిత హామీలు ఇచ్చి.. నేడు మడమ తిప్పారన్నారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, జడ్ వెంకటరెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకటస్వామి రెడ్డి, జానకీరాముడు, గోకవరం స్వామిరెడ్డి, రామసుబ్బయ్య, చంద్రగౌడు, నాగార్జునగౌడు, అంబయ్య, రాధాకృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, సీలం లింగన్న, శివారెడ్డి, పోతుల నారాయణ, మారెన్న, మాడుగుల శేఖర్, సుధాకర్, రామలింగ నాయుడు, జిలాని బాషా, చాంద్‌బాషా, షఫీవుల్లా, వెంకటస్వామి పాల్గొన్నారు.

నందికొట్కూరు: జగన్మోహన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిత్తా జయసూర్య అన్నారు. గురువారం పట్టణంలోని 18వ వార్డులో పట్టణ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. జయసూర్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించామన్నారు. చెత్తపై కూడా పన్ను వేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, నందికొట్కూరు, పట్టణ నాయకులు జకీర్ హుస్సేన్, ముర్తుజావలి, షకీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శెట్టి రవి, చిన్న పుల్లారెడ్డి, రవి, నిమ్మకాయల రాజు, సత్తార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మీనాక్షిదేవి, లక్ష్మీ, రూబియా తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న జయసూర్య

'మరమ్మతులు చేయాలి'


వినతి పత్రం అందజేస్తున్న బైటిపేట వాసులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 1: నంద్యాల పట్టణంలోని 42వ వార్డులో సామూహిక మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులకు చేపట్టాలని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డికి మహిళలు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు ఆధ్వర్యంలో బైటిపేట మహిళలు ఇన్‌చార్జి కమిషనర్‌ను కలిశారు. మూడు నెలలుగా మరుగు దొడ్లల్లో కొళాయిలు విరిగిపోయి నీళ్ల రాక, తలుపులు పని చేయక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్ కూడా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించారు. సీపీఎం కార్యకర్తలు, వార్డు మహిళలు పాల్గొన్నారు.

వలసలు నివారించాలి: సీపీఎం

ఆత్మకూరు, ఫిబ్రవరి 1: ఆత్మకూరు మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కల్పించి వలసలను నివారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శి నరసింహనాయక్‌లు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. దీంతో వ్యవసాయ పనులు లేక కూలీలు ఇతర జిల్లాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వివరించారు. వలసల నివారణకు మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను నిర్వహించి వలసలు నివారించాలని తెలిపారు. ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో 200 పనిదినాలు కల్పించి రూ.600 కూలీలు ఇవ్వాలని చెప్పారు. ఈసమావేశంలో ఆపార్టీ నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, మాబాషా, శివమ్మ ఉన్నారు.

డీఐజీ సెంథిల్ కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు


నంద్యాలలో డీఐజీకి వీడ్కోలు పలుకుతున్న పోలీసు అధికారులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1: వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్.సెంథిల్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం నంద్యాల పట్టణంలో ఆయనకు నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. డీఐజీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆవిర్భావ సమయం నుంచి వసతుల విషయంలో బలహీనంగా ఉన్నప్పటికీ నెమ్మదిగా అభివృద్ధి చెందుతూ క్రైం రేటు తగ్గించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషిచేశారన్నారు. డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొని డీఐజీని సన్మానించారు.

అక్రమ లే అవుట్‌ల తొలగింపు


పాములపాడులో అక్రమ లే అవుట్‌లను తొలగిస్తున్న దృశ్యం

పాములపాడు, ఫిబ్రవరి 1: పాములపాడులో అక్రమంగా వేసిన లే అవుట్‌లను అధికారులు తొలగించారు. గురువారం ఈవోపీఆర్డీ శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, కుడా అనుమతులు లేకుండా ఎలాంటి నిబంధనలు పాటించకుండా లే అవుట్‌లు వేశారని గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు లేఅవుట్‌లను తొలగిస్తున్నామని అధికారి తెలిపారు. రియల్ వ్యాపారులు, భూ యజమానులకు నోటీసులు అందించామని, అయితే వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని చెప్పారు.

ఓంకారంలో వేలం పాటలు వాయిదా

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 1: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో బహిరంగ వేలం పాటలు వాయిదా పడినట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు వివిధ రకాల అమ్మకాలకు చైర్మన్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన వేలం పాటల్లో సరైన పాటలు రానందున సదరు వేలం పాటలన్నీ వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి వేలం పాటలు నిర్వహించే తేదీ దేవాదాయశాఖ ఉన్నతాదికారులు నిర్ణయిస్తారని ఈవో తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అర్చకుడు సుధాకరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో వివాదం

పగిడ్యాల ఫిబ్రవరి 1: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ, ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణంలో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఆలయ నిర్మాణం పనులు పూర్తి కావడంతో దేవాలయ కమిటీ పెద్దలు ప్రహరీ నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రహరీ నిర్మాణానికి సంబంధించి సమీపంలోని ఇల్ల వారు అభ్యంతరం చెప్పడంతో వివాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలతో మాట్లాడారు. ఆలయ నిర్మాణం విషయంలో గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకుడు మనోహర్‌చౌదరి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 1: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఇసుకాల సుబ్బరాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం టీడీపీ మండల సీనియర్ నాయకుడు, సొసైటీ చైర్మన్ మనోహర్‌చౌదరి గ్రామానికి వెళ్లి సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. మనోధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ అశోక్‌చౌదరి, వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, చంద్రయ్య, బాషా, వెంకటసుబ్బయ్య, జాను, దాసు పాల్గొన్నారు.

'కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అభినందనీయం'


సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర గుప్తను సత్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 1: ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటనర్సయ్య అన్నారు. గురువారం ఆత్మకూరు కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగేంద్ర గుప్త రూ.25వేలు ఖర్చు చేసి ప్రధాన ద్వారానికి ఐరన్ గ్రిల్ వేయించడం వల్ల కళాశాల అధ్యాపకులు ఆయన్ని సత్కరించి అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ వెంకటనర్సయ్య మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నాగేంద్రగుప్త చేసిన సహకారంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి సహకరిస్తే కళాశాల అన్నివిధాలుగా ముందుకు సాగనుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యాసాగర్, పద్మావతిబాయి, కృష్ణ తదితరులు ఉన్నారు.

'రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత'

ఆత్మకూరు, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం డీపాల్ స్కూల్‌లో స్కూల్ బస్సుల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్కూల్‌బస్సుల డ్రైవర్లు రోడ్డు భద్రతా విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. విధులకు హాజరయ్యే ముందు బస్సు సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలని తెలిపారు. పిల్లలు బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అలాగే ప్రత్యేకించి డ్రైవర్లు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, వాహనాలను వేగంగా ఓవర్‌టేక్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటివి చేయరాదని తెలిపారు. ప్రత్యేకించి డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

సూపరింటెండెంట్ అత్యుత్సాహం

● ప్రభుత్వాసుపత్రిలో వైసీపీ నాయకుడికి సన్మానం


దారా సుధీర్‌కు పూలమాల వేస్తున్న సూపరింటెండెంట్

నందికొట్కూరు ఫిబ్రవరి 1: నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిటెండెంట్ రాంబాబు అత్యుత్సాహం ప్రదర్శించారు. గురువారం నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్లగా.. సూపరింటెండెంట్ రాంబాబు పూలమాల వేసి స్వాగతం పలికారు. ఏ హోదాలో దారా సుధీర్‌కు సూపరింటెండెంట్ పూలమాల వేసి స్వాగతం పలికారని, ప్రభుత్వ ఆసుపత్రా లేక వైసీపీ కార్యాలయమా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటూ అధికారులు వారి పోస్టులను పదిలం చేసుకుంటున్నారే తప్పా.. కొత్తగా నిర్మించిన ఆసుపత్రిని ప్రారంభించి 6 నెలలు గడుస్తున్నా.. అత్యాధునిక వసతులను కల్పించడంలో విఫలమవుతున్నారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

వాహనాల తనిఖీ


చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మహానంది, ఫిబ్రవరి 1: మండలంలోని నల్లమల సమీపంలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గురువారం ఏఎస్‌ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది గుంటూరు-నంద్యాల రహదారిలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద అటువైపుగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వాహనాల్లో మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాల్లో అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ డీఎస్ ప్రసాద్, నూర్‌బాషా, మాబువలీ పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

పాములపాడు, ఫిబ్రవరి 1: పాములపాడు మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.83,26,449 విడుదలైనట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొదటి, రెండవ విడతల్లో భాగంగా భానుముక్కల గ్రామానికి రూ.4,35,056, చెలిమిల్ల గ్రామానికి రూ.3,29,402, ఇస్కాల గ్రామానికి రూ.6,18,794 విడుదలయ్యాయని చెప్పారు. జూటూరు గ్రామానికి రూ.3,97,584, తుమ్మలూరు గ్రామానికి రూ. 7,50,184, మద్దూరు గ్రామానికి రూ.9,74,474 విడుదలయ్యాయని తెలిపారు. మిట్టకందాల గ్రామానికి రూ.6,99,719, వాణాల గ్రామానికి రూ.5,14,158, వేంపెంట గ్రామానికి రూ.9,94,800, ఎర్రగూడూరు గ్రామానికి రూ.6,66,819, రుద్రవరం గ్రామానికి రూ.3,37,714 విడుదలయ్యాయన్నారు. బానకచెర్ల గ్రామానికి రూ.3,95,583, పాములపాడు గ్రామానికి రూ.9,16,420, లింగాల గ్రామానికి రూ.2,89,700 విడుదలైనట్లు తెలిపారు.

అధికారుల బదిలీ

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 1: నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా గత ఏడాదిన్నర్ర కాలం నుంచి పని చేస్తున్న సి.రవిచంద్రారెడ్డి బదిలీ అయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ వైశ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నంద్యాల కమిషనర్ సి.రవిచంద్రారెడ్డిని ఆయన మాతృశాఖ వర్క్స్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్స్‌కు బదిలీ చేశారు.

కమిషనర్‌గా పి.నిరంజన్‌రెడ్డి

నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా పి.నిరంజన్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పురపాలక శాఖలో వెయిటింగ్ ఫర్ పోస్టింగ్‌లో ఉన్న నిరంజన్‌రెడ్డిని సి.రవిచంద్రారెడ్డి స్థానంలో కమిషనర్‌గా నియమించారు.

పాణ్యం: పాణ్యం తహసీల్దారు శ్రీనివాసులు గౌడ్ తిరుపతికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం రెవెన్యూ సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికి ఘనంగా సత్కరించారు. తహసీల్దారు బాధ్యతలను డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరెడ్డి చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

జయప్రదం చేయాలి: ఎస్ఎఫ్ఐ


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్

ఆత్మకూరు, ఫిబ్రవరి 1: ఆత్మకూరు పట్టణంలోని థెరిసా జూనియర్ కళాశాలలో ఈనెల 6న నిర్వహించే టెన్త్ ట్యాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్, పట్టణాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు భయాన్ని పోగొట్టేలా ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నపత్రం ఎలాంటి ఉంటుందన్న అంశంపై అవగాహన కల్పించేలా ఈపరీక్షను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈపరీక్ష తెలుగు, ఆంగ్ల భాషలో వంద మార్కులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు ఈట్యాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6303261839 సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో నాయకులు గంగాధర్, లింగేష్, సాయి, ప్రతాప్, దిలీప్, శివమణి తదితరులు ఉన్నారు.

'ఉత్తమ పౌరులుగా ఎదగాలి'

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 1: విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని న్యూక్లియస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. నంద్యాలలోని న్యూక్లియస్ జూనియర్ కళాశాల 7వ వార్షికోత్సవం డీవైఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్.మురళీధర్‌రెడ్డి, డైరెక్టర్ ఎన్.వి.వాసుదేవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరేళ్లలో కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో ముందుకువెళ్లాలని సూచించారు. అనుకున్న లక్ష్యాలను చేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, ఆధునిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ తెలుగు కవి కొప్పుల ప్రసాద్ రాసిన శూన్యపు మనసులో చిగుళ్లు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం

టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 1: ఎన్నిక లకు ముందే వైసీపీ ఓటమి ఖాయమైందని సీఎం జగన్‌కే తెలిసిపోయిందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బా రెడ్డి అన్నారు. గురువారం శ్రీశైలంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకే శ్‌ను సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, భరత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకేలను అందజేసి స్వాగతం పలికారు. సుబ్బారెడ్డి మాట్లా డుతూ వైసీపీ ప్రభుత్వం సాగించిన అరాచక విధానాలతో రాష్ట్ర ప్రజలు విసిగి పోయారన్నారు. సీఎం జగన్ నియంతృత్వ పోకడలతో రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగిందన్నారు. ప్రజాధనాన్ని దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలే స్వయంగా పార్టీ పరిస్థితి ఏమీ బాగాలేదని సీఎం జగన్‌కు చెబుతున్నారంటే.. పాలన ఎంత అధ్వానంగా ఉందో అందరికీ తెలిసిపోయిందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని సుబ్బారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

నియంతను సాగనంపుదాం: టీఎన్‌టీయూసీ



మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

డోన్, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో నియంతృత్వ పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టి ముక్కల రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ అన్నారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్మిక చైతన్య బస్సు యాత్ర గురువారం డోన్ పట్టణానికి చేరుకుంది. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అజీజ్ ఆధ్వ ర్యంలో స్వాగతం పలికారు. రఘురామరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కార్మికులకు అరకొర సంక్షేమ పథకాలు ఇస్తూ అంతకు పదింతలు పన్నుల రూ పంలో వసూలు చేస్తున్నదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల లక్ష లాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సి వచ్చిం దన్నారు. వైసీపీకి బుద్ధి చెప్పేందుకు కార్మికులంతా ఎదురు చూస్తున్నారన్నారు. వలసల రామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎప్పుడెప్పుడు దిగిపోతాదా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధి కార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, టీఎన్‌టీయూసీ నాయకులు నాగోతి శివాజి, మోహన్‌రావు, నరసింహ యాదవ్, హుశేన్‌పీరా, ధర్మవరం హరినాథరెడ్డి, కోనేటి కాశీవిశ్వనాథ్, ఆచారి బబ్లూ యాదవ్, బాషా, మురళి పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

బనగానపల్లె, ఫిబ్రవరి 1: బనగానపల్లె పట్టణంలో గత వారం రోజులుగా అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. మరమ్మతుల పేరుతో విద్యుత్‌ను తీసివేస్తున్నా రు. గురువారం పట్టణంలో చాలా సార్లు విద్యుత్ కోత విధించారు. ఎలాం టి కార ణం లేకుండానే విద్యుత్‌ను తీసివేస్తున్నారని వినియోగదారులు, ప్రజలు వాపో తున్నారు. అధికారులను అడిగితే 10 నిమిషాల్లో విద్యుత్ వస్తుందంటారు. కాని విద్యుత్ సరఫరా సరిగా కావడంలేదు. అధికారులు స్పందించి మరమ్మతులు ఉంటే ఒక రోజు టైం తీసుకొని విద్యుత్ కోతలు విధించాలి. కాని ప్రతి రోజు మరమ్మతుల పేరుతో ప్రజలకు ఇబ్బంది కలిగిం చడం ఎంతవరకు సమం జసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ నాయకుడి మృతి

బనగానపల్లె, ఫిబ్రవరి 1: మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వీఆర్‌వో ఈశ్వరయ్య (77) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు వారి కుటుంబ సభ్యులకు గురువారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఈశ్వర య్య ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే ఆకస్మాత్తుగా మృతి చెందాడు. ఆయన మృతి పట్ల బీసీ ఇందిరమ్మతోపాటు పలువురు టీడీపీ నాయకులు వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 1: ఆళ్లగడ్డ పట్టణ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి నెమలి శివశంకరరెడ్డి, ఆయన కూతురు చైతన్య తీవ్రంగా గాయపడ్డారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామానికి చెందిన శివశంకరరెడ్డి తన కూతురికి స్కూటర్ నేర్పిస్తున్న సమయంలో అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడటంతో పడకండ్లకు చెందిన సుధాకరరెడ్డి విషయం తెలుసుకొని చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన నెమలి శివశంకరరెడ్డి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. ఆయన కూతురు చైతన్య డాక్టర్ కోర్సు పూర్తి చేశారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

అవుకు, ఫిబ్రవరి 1: మండలంలోని గుండ్లశింగవరానికి చెందిన కుమ్మరి సుబ్బయ్య అనే వ్యక్తిపై గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి కొడవలితో దాడిచేసి గాయపరిచినట్లు ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఇరువురికి ట్రాక్టరు వివాదం విషయంలో ఘర్షణ పడ్డారన్నారు. దీంతో భూపాల్ రెడ్డి కు మ్మరి సుబ్బయ్యపై కొడవలితో దాడి చేశారన్నారు. ఈఘటనలో కుమ్మరి సుబ్బయ్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికు తరలించారని తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

అధికారుల బదిలీ

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 1: మండలంలోని తహసీల్దారు రవికుమార్, ఎంపీడీవో ఉమమహేశ్వరరావు బదిలీ అయ్యారు. సిబ్బంది వీరిని గురువారం ఘనంగా సన్మానించారు. తహసీల్దారు కడప జిల్లా పులివెందుల ఆర్డీవో కార్యాల యానికి బదిలీ కాగా ఎంపీడీవో కడప జిల్లాలోని సిద్దవటం మండలానికి బదిలీ అయినట్లు వారు తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు తులసీకృష్ణ, ఆర్‌ఐ సత్తారు, వీఆర్వోలు, వీఆర్వేలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: వచ్చే ఎన్నికల నేపథ్యంలో ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య నర్సీపట్నానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పలమనేరు డీఎస్పీ ఎన్. సుధాకర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది.

దొర్నిపాడు: తహసీల్దార్ జయప్రసాద్ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తహసీల్దార్‌ను బదిలీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ జయప్రసాద్‌ను వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు తహసీల్దార్‌కు శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా యాదవ సంఘం డైరెక్టర్ బత్తుల నాగేశ్వరయాదవ్, మాజీ సొసైటీ అధ్యక్షుడు సిద్ది సత్యం, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్‌లో పని చేస్తున్న ఎంపీడీవో మహబూబ్‌దౌలా అనంతపురం జిల్లాకు, తహసీల్దార్ సుభద్రమ్మ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీవోలను బదిలీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో గురువా రం ఎంపీడీవో మహబూబ్‌దౌలాను ఎంపీపీ వీరభద్రుడు, కార్యదర్శులు, సచివా లయ ఉద్యోగులు సన్మానించారు.

శిరివెళ్ల: సాధారణ ఎన్నికల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో కేవీ సుబ్రమణ్యంను శిరివెళ్ల మండలంలోని సచివాలయ ఉద్యోగులు శాలువా, పూలమాలలతో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

చాగలమర్రి, ఫిబ్రవరి 1: జిల్లాలో పది పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యమని జిల్లా డీఈవో సుధాకర్‌రెడ్డి చెప్పారు. గురువా రం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల గ్రేడిం గ్‌ను అడిగి తెలుసుకున్నారు. అటల్ టింకర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ల్యాబ్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత టీచర్‌ను ఆదేశించారు. ఐఎఫ్‌పీఎస్ డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు డిజిటల్ బోధన కొనసాగిం చాలని సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులను ఏర్పాటు చేశామని చెప్పారు. మద్దూరు, పెద్దబోదనం పాఠశాలలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయడంలో అలసత్వం తగదన్నారు. ఈ ఏడాది జిల్లాలో 24,223 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారని, వీరి కోసం 133 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు పకడ్బం దీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. ఆయన వెంట ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఉపాధ్యా యులు మహబూబ్‌బాషా, శంకర్, సీఆర్పీలు అమీర్‌ఖాన్, ఖాశీం ఉన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఇక్బాల్ బాషా

డోన్(రూరల్), ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ .. దగా డీఎస్సీ అని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్ బాషా విమర్శించారు. గురువారం సాయంత్రం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి గత పాదయాత్రలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 50వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని విడుదల చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించా రన్నారు. కేవలం 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడు దల చేయడం దారుణమన్నారు. కనీసం 30వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీఎస్సీలో అప్రంటిషిప్ విధాన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు జీవీ రమణ, నాగరాజు, మౌలాలి, బాస్కర్, విశ్వనాథ్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'మెరుగైన వైద్య సేవలు అందించాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 1: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, నిర్లక్ష్యం వద్దని వైద్యా ధికారి గాయత్రి అన్నారు. మండలంలోని ఆలమూ రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురువారం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించాల ని ఎంఎల్‌హెచ్‌పీలను ఆదేశించారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు.

'విధులు సక్రమంగా నిర్వర్తించాలి': విధులు సక్రమంగా నిర్వర్తించాలని డీఎంహెచ్‌వో డా.వెంక టరమణ ఆదేశించారు. గురువారం ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ముత్యాలపాడు సబ్ సెంటరుకు సంబంధించిన ఏఎన్‌ఎంను విచారించారు. ఫిర్యాదులు వస్తే చర్య లు తప్పవని హెచ్చ రించారు.

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న బీసీ



మల్లన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు

బనగానపల్లె, ఫిబ్రవరి 1: బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం శ్రీశైలం మల్లన్నను దర్శించుకొని పూజలు చేశారు. సాక్షి గణపతి, వీరభద్రస్వామి, భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు బీసీకి తీర్థ ప్రసాదాలు అం దించారు. కార్యక్రమంలో నంద్యాల, డోన్ టీడీపీ ఇన్‌చార్జిలే ఎన్ఎండీ ఫరూక్, ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు. అలాగే శ్రీశైలానికి దర్శనానికి వచ్చిన టీడీపీ జాతీ య ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు సున్నిపెంటలోని హెలిపాడ్ వద్ద మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

'పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి'



ఆర్.క్రిష్ణాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా గ్రామాల్లోని ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళీశ్వరరెడ్డి కోరారు. ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపు రంలో గురువారం పోస్టల్ పథకాలపై పోస్టల్ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. పోస్టల్ శాఖ అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో మైల్‌వర్సల్ భాస్కరరావు, పోస్టల్ సిబ్బంది కార్తీక్, నరేం ద్ర, మస్తాన్, జాఫర్, జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థితో ఎంఈవో

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 1: జాతీయ ఉపకార వేతనాలకు కోవెలకుంట్ల ప్రభుత్వ పాఠశా లలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి ఎంపికైనట్లు ఎంఈవో వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాటట్లాడుతూ పట్టుదలతో చదివినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థి తిరుపాలునాయక్‌ను ఎంఈవో, ప్రధానో పాధ్యాయుడు రాజ య్య, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధాయులు నాగే శుడు, మల్లికార్జున, శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి, సుధీర్, వెంకటరమేష్, తిరు పతి రెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుగుణ, జహినాబీ, శ్రీపతి పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లెలో అహోబిలేశుడికి పూజలు



పూజలందుకుంటున్న అహోబిలం పార్వేట ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 1: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని నాగిరెడ్డిపల్లెకు గురువారం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ చేరుకుంది. మండలంలోని బాచ్చాపురం గ్రామం నుంచి బయలు దేరిన ఉత్సవ పల్లకికి గ్రామస్థులు మేళతాళాలతో స్వాగతం పలికారు. గ్రామంలోని తెలుపుల వద్ద ఉత్సవ పల్లకి విడిది చేయడంతో ప్రజలు పాల్గొని పూజలు చేశారు.

సంతాన వేణుగోపాలుడికి..

రుద్రవరం: రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో గురు వారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు నిత్య కృతదాస్ వేణుగోపాలస్వామి సత్యభామ రుక్మిణీ అమ్మవార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలి వచ్చిన భక్తులు గీతాపారయణం చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సాయినాథుడికి.. చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం భక్తులు సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు.

సాయిబాబాకు..

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువా రం సాయిబాబాకు వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. మహిళలు సామూహికంగా సాయివ్రతం చేశారు. ప్రత్యేక హారతులు ఇచ్చి భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయి బాబా పల్లకిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారా యణ, సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్, మహిళలు పాల్గొన్నారు.

'ఆమె బతికున్నంత కాలం పింఛన్ అందిస్తా'



చాకలి పుల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఫిబ్రవరి 1: మండలంలోని చెర్వుపల్లె గ్రామా నికి చెందిన చాకలి పుల్లమ్మ కుమారుడు సుబ్బరాయుడు మతిస్థిమితం లేక ఇబ్బంది పడు తుండంతో గురువారం టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ సొంత నిధులతో పింఛన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ మతిస్థిమితం లేని సుబ్బరాయుడు దుస్థితి చూసి చలించి ఆమె బతికున్నంత కాలం పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిగా శిల్పా సుబ్రహ్మణ్యం



కోవెలకుంట్ల, ఫిబ్రవరి 1: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిగా శిల్పా సుబ్ర హ్మణ్యం ఎంపికయ్యారు. గురువారం ఆయనను పలువు రు ఆర్యవైశ్య సంఘం నాయకులు, పట్టణ వాసులు అభినందించారు. కోవెలకుంట్ల రోటరీక్లబ్ అధ్యక్షుడిగా, ఆర్యవైశ్య సంఘం మండల కార్య దర్శిగా పనిచేసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈయన సేవలను గుర్తించి జిల్లా నాయకులు జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శిగా నియమించారు. శిల్పా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్యాపిలి, ఫిబ్రవరి 1: మండలంలోని గుడిపాడు గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో మధుసూదన్(29) మృతి చెందాడు. పొలం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మధుసూదన్ విద్యుత్ తీగను తొక్కారు. దీంతో ఆయన అక్కడి అక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ప్యాపిలి పోలీసులను వివరణ కోరగా విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

'ఇంటి పన్ను వసూలు చేయాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 1: మండలంలోని 21 పంచాయతీల్లో కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేయాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. 2023-24 ఇంటి పన్నును మార్చి బడ్జెట్‌లోపే వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని, నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. మండలంలోని అన్ని పం చాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు.

ఎస్సార్బీసీలో పాముల బెడద

అవుకు, ఫిబ్రవరి 1: అవుకు పట్టణంలోని ఎస్సార్బీసీ కాలనీలో పాముల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి ఎస్సార్బీసీ కాలనీలోని ఇళ్ల వద్దకు రక్తపింజరి అనే పాము రావడంతో ప్రజలు పరుగులు తీశారు. దీంతో యువకులు సాహసం చేసి పామును చంపేశారు. కాలనీలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని ప్రజలు తెలిపారు.

ఆసరా చెక్కుల పంపిణీ

డోన్(రూరల్), ఫిబ్రవరి 1: పట్టణంలోని షాదీఖానాలో గురువారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రూ.4.54 కోట్ల చెక్కును పొదుపు సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, సోషల్ మీడియా కన్వీనర్ టీఈ దినేష్‌గౌడు, పట్టన కౌన్సిలర్లు మెప్మా టీఎంసీ సుజాత, ఆర్పీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 1: మండలంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ను వేగవంతం చేయాలని తహసీల్దార్ సుభద్రమ్మ వీఆర్వోలు, హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయం లో 3, 4, 5 సచివాలయాల్లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆళ్లగడ్డ సబ్‌రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ ప్రారంభించారు. ఆరుగురు లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేశారు. వారు మాట్లాడుతూ 3,200 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, వారందరికీ రిజిస్ట్రేషన్‌లు చేస్తారని చెప్పారు. రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్‌లోనే నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో వీఆర్వోలు ఉన్నారు.

నీటి విడుదల



రుద్రవరం చేరిన నీరు

రుద్రవరం, ఫిబ్రవరి 1: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాలువకు తాగునీటి అవసరాల నిమిత్తం గురువారం నీటిని విడుదల చేసినట్లు గంగ అధికారులు తెలిపారు. ఈ నీరు కేవలం ప్రజల తాగునీటి అవసరానిమిత్తం విడుదల చేసినట్లు వారు తెలిపారు. నీటిని దుర్వి యోగం చేయవద్దని సూచించారు.

'కులగణన సర్వే పకడ్బందీగా చేయాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 1: కులగణన సర్వే వేగవంతంగా, పకడ్బందీగా చేయాలని ఎంపీడీవో మహబూబ్‌దౌలా సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేలో తప్పులు లేకుండా చేయాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవా లన్నారు. ప్రత్యేక అధికారులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులచే కులగణన సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాత్రలు అందజేస్తున్న పలుకూరు వైద్య సిబ్బంది

బనగానపల్లె, ఫిబ్రవరి 1: బనగానపల్లె జాతీయ నులి పురుగు నివారణలో భాగంగా పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్బెండజోల్ మాత్రలను గురువారం ఎంపీడీవో శివరామయ్య, ఎంఈవో స్వరూపకు వైద్యాధి కారులు పంపిణీ చేశారు. ఈ మాత్రలను అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేయాలని కోరారు. ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు మింగించాలని కోరారు. విదఆ్యర్థుల్లో రక్తహీనత, పోషకాహార లోప నివారణకు ఈ మాత్రలు ఉపయోగ పడతాయని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సీపీఐ విరాళాల సేకరణ



వ్యాపారి నుంచి విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 1: బేతంచెర్ల పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మండల కార్యదర్శి భార్గవ్, సహాయ కార్య దర్శులు తిరుమలేష్, దస్తగిరి ఆధ్వర్యంలో పట్టణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత చర్యలను ప్రజలకు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజా ఉద్యమాలకు విరాళాలను గురువారం సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవ లంబిస్తున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు ప్రభుత్వాలను గద్దె దిం పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగమద్ది, శివ, శ్రీనివా సులు, వలి, మారుతి, రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐవైఎఫ్ బాస్కర్, ప్రదీప్, నందు, విజయ్ పాల్గొన్నారు.

'చదువుతోపాటు క్రీడలూ అవసరమే'



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఇషత్ బేగం

శిరివెళ్ల, ఫిబ్రవరి 1: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసర మని శిరివెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇషత్ బేగం అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా బ్యాడ్మింటన్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థినులు లిఖిత, శ్రీలత ప్రతిభ కనబరచి నియోజకవర్గస్థా యిలో ద్వితీయస్థానంలో నిలిచి ట్రోఫీ, నగదు ప్రోత్సాహం అందుకున్నారని తెలి పారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో తోడ్పాటునంది స్తాయని అన్నారు. బ్యాడ్మింటన్‌లో రాణించిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఇషత్ బేగం, ఉపాధ్యాయులు షహబు ద్దీన్, శివ శంకర్‌లు అభినందించారు.

'ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి'



జిల్లా ఆర్యవైశ్య సభ్యులకు సన్మానం

చాగలమర్రి, ఫిబ్రవరి 1: ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సంఘం అధ్యక్షుడు లక్ష్మణబాబు సూచించారు. గురువారం నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలో చాగలమర్రికి చెందిన మాలేపాటి వెంకటేశ్వరబాబు, బచ్చు శ్రీనివా సులు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపికైన వీరిని ఆర్యవైశ్య సంఘ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ యువజన సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఆవోపా అధ్యక్షుడు సుం కు రాజేష్, రమణ, శ్రీనివాసులు, ప్రసాదు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణ

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 1: మండలంలోని కోటకందుకూరు ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులకు ఆళ్లగడ్డ పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో గురువారం వృత్తి విద్యా కోర్సు కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ రాజు చెప్పారు. చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు చాలా అవసరమని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ప్రతాప్, జయప్రకాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ సభను విజయవంతం చేయాలి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 1: ఆళ్లగడ్డ పట్టణంలో శనివారం నిర్వహించనున్న టీడీపీ బీసీ జయహో సభను విజయవంతం చేయాలని బీసీ నాయకులు భాస్కర్‌యాదవ్, రామాచారి గురువారం పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి అఖిలప్రియ హాజరవుతారని చెప్పారు. నియో జకవర్గంలోని బీసీ నాయకులంతా హాజరు కావాలని వారు కోరారు.

పండ్ల తోటల సస్యరక్షణపై అవగాహన

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 1: గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలపై అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను నంద్యా ల జిల్లా డ్వామా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర గురువారం వివరించారు. మండ లంలోని ఓబుళంపల్లె గ్రామ పంచాయతీని గురువారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలోని రైతులు సాగు చేసిన పండ్లతోటలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో 20 రకాల పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీవో గణేష్, రంగయ్య, ఖాలేశా, హుస్సేనయ్య పాల్గొన్నారు.